22-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీకు దివ్య దృష్టి లభించింది - ఈ పాత ప్రపంచం సమాప్తమవ్వనున్నదని మీకు తెలుసు, కావున దీనిపై మమకారాన్ని తొలగించాలి, పూర్తి-పూర్తిగా బలిహారమవ్వాలి"

ప్రశ్న:- అవినాశీ తండ్రిపై పూర్తిగా బలిహారమైన పిల్లలు ఎవరైతే ఉన్నారో వారి గుర్తులేమిటి?

జవాబు:- వారు తమ ధనం మొదలైనవాటిని వ్యర్థంగా ఖర్చు చేయరు. భక్తి మార్గంలో దీపావళి మొదలైనవాటిలో ఎంతగా బాణాసంచా కాలుస్తారు. అల్పకాలికమైన సంతోషాలను జరుపుకుంటారు. మీకు తెలుసు, ఇదంతా సమయాన్ని వ్యర్థము చేయడము, ధనాన్ని వ్యర్థం చేయడము, శక్తిని వ్యర్థం చేసుకోవడము. ఇక్కడ మీరు అటువంటి సంతోషాలు జరుపుకోకూడదు ఎందుకంటే మీరు వనవాసములో ఉన్నారు. మీరు ఈ ముళ్ళ ప్రపంచం నుండి పుష్పాల ప్రపంచములోకి వెళ్ళాలి.

గీతము:- మిమ్మల్ని పొంది మేము... (తుమ్హే పాకే హమ్నే...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన పిల్లలు పాట అర్థాన్ని అర్థం చేసుకున్నారు. ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రిని పొందారు, మీకు తండ్రి సహాయం చేస్తారు. 5 వికారాలను జయించేందుకు అనగా మాయపై విజయాన్ని పొంది జగజ్జీతులుగా అయ్యేందుకు సహాయం చేస్తారు. జగత్తు అని మొత్తం ప్రపంచాన్ని అనడము జరుగుతుంది. పిల్లలకు తెలుసు, మనం మొత్తం జగత్తుకు యజమానులుగా అయ్యేవారము. యజమానులుగా ఎప్పుడు అవుతారు? ఎప్పుడైతే రావణ రాజ్యం పూర్తవుతుందో, అప్పుడు అవుతారు. రావణుడిని ప్రతి సంవత్సరము కాలుస్తారు ఎందుకంటే సంగమయుగంలో తండ్రి వచ్చి ఆత్మ యొక్క దీపాన్ని వెలిగించి సత్యయుగానికి యజమానులుగా చేస్తారు. దసరా తర్వాత దీపావళి రోజున మనుష్యులు చాలా మంచి-మంచి వస్త్రాలను ధరిస్తారు. తరచుగా లక్ష్మీ-నారాయణుల, రాధే-కృష్ణుల మరియు దేవీల మందిరాలకు వెళ్తారు. కానీ దేవీల గురించి మరియు లక్ష్మీ-నారాయణుల గురించి వారికి తెలియదు. దేవీలు అంటే శివ శక్తులు, బ్రాహ్మణీలు. దేవీల చేతులలో అస్త్ర, శస్త్రాలను చూపిస్తారు. వాస్తవానికి దేవీల చేతులలో అస్త్ర, శస్త్రాలు ఏవీ ఉండవు. వారు గుప్తముగా ఉన్నారు. రావణుడిపై విజయాన్ని పొందుతారు కావున అర్ధకల్పం కోసం మీ సంతోషాలు స్థిరముగా నిలిచి ఉంటాయి. ఇప్పుడు మీరు సంతోషాలు జరుపుకోరు. ఇదేమైనా దీపావళినా ఎందుకంటే ఈ రోజు దీపాలు వెలిగిస్తారు, రేపు ఆరిపోతాయి. దసరాను కూడా ప్రతి సంవత్సరం జరుపుకుంటూ ఉంటారు. బ్రాహ్మణులైన మీరు తమ ఇళ్ళల్లో దీపాలను ఏమీ వెలిగించరు. మందిరాలు మొదలైనవాటిలో దీపాలు, లైట్లు మొదలైనవి వెలిగిస్తారు. దీపావళి, దసరా అంటే ఏమిటో మనుష్యులకు తెలియదు. ఆ సమయంలో మొత్తం భారత్ యే కొత్తగా అవుతుంది. దీపాలు మొదలైనవి వెలిగించడము, ఇవన్నీ భక్తి మార్గానికి సంబంధించినవి. భక్తి మార్గంలో ఎంత ధనాన్ని వ్యర్థం చేస్తారు. ఆ రోజు బాణాసంచాను ఎంతగా కాలుస్తారు. సమయాన్ని వ్యర్థం చేస్తారు, ధనాన్ని వ్యర్థం చేస్తారు, శక్తిని వ్యర్థం చేస్తూ ఉంటారు. ఇది ముళ్ళ అడవి. అందరూ ఆటవికులుగా అయిపోయారు. మీరు కూడా మొదట అలాగే ఉండేవారు, ఏమీ అర్థం చేసుకునేవారు కాదు. సత్యయుగములో వ్యర్థమైన ఖర్చును చేయరు. ఇక్కడైతే వ్యర్థమైన ఖర్చు చాలా ఉంటుంది. దాన పుణ్యాలు చేయడం ద్వారా కూడా అల్పకాలికమైన ఫలం లభిస్తుంది. మీకు తెలుసు, మనం అవినాశీ తండ్రిపై బలిహారమయ్యాము కావున మనదంతా అవినాశీగా అయిపోతుంది. పాత శరీరాన్ని వదిలి కొత్తదానిని తీసుకుంటారు. పిల్లలైన మీరు మోహాజీత్ రాజు కథనైతే విన్నారు కదా. ఈ కథ సత్యయుగం కోసం కాదు ఎందుకంటే అక్కడ అకాల మృత్యువు ఉండదు. ఆ సమయంలో అందరూ నష్టోమోహులుగా, మోహాజీతులుగా ఉంటారని కేవలం ఉదాహరణ చెప్పడం కోసం,కథను తయారుచేసారు. శరీర సహితముగా పాత ప్రపంచం నుండి మమకారాన్ని తొలగించాలి ఎందుకంటే మీరు కొత్త ప్రపంచంలోకి వెళ్తున్నారు. పాత ప్రపంచముపై ఎవరికైనా మమకారం ఉంటుందా? దీనిని అనంతమైన సన్యాసము అని అంటారు. దేహముపై మమకారాన్ని తొలగించుకోండి అని కేవలం బాబా ఇదే చెప్పారు. కానీ ఈ కళ్ళతో వేటినైతే చూస్తారో, అన్నింటినీ మర్చిపోండి ఎందుకంటే అంతా సమాప్తం కానున్నదని ఇప్పుడు దివ్య దృష్టి లభించింది. పాత ప్రపంచం వినాశనం అయ్యేదే ఉంది మరియు కొత్త విశ్వం తయారవుతుంది. శివబాబా మనకు రాజ్యాన్ని ఇస్తారు. శివబాబా పేరు ఎల్లప్పుడూ శివ అనే ఉంటుంది ఎందుకంటే వారికి తమ శరీరమైతే లేదు. బ్రహ్మ, విష్ణు, శంకరులకు కూడా తమ శరీరాలున్నాయి. వారు పైన ఉంటారు. అమరనాథుడు అమరులుగా తయారుచేసే కథను అమరలోకంలోకి తీసుకువెళ్ళేందుకు వినిపిస్తారు. పిల్లలైన మీరిప్పుడు పుష్పాలుగా అవుతున్నారు. ముళ్ళను పుష్పాలుగా

చేయడంలో శ్రమ అయితే అనిపిస్తుంది. ఇక్కడైతే అందరూ ముళ్ళలా ఉన్నారు. ఒకరికొకరు ముళ్ళు గుచ్చుకుంటూ ఉంటారు, ఇక అడగకండి. కనుక తండ్రి అంటారు, మీరు ఇప్పుడు ఎవ్వరికీ ముళ్ళు గుచ్చకూడదు. కామ ఖడ్గాన్ని నడిపించకూడదు. ఈ కామం యొక్క హింస ఆది మధ్యాంతాలు దుఃఖాన్ని ఇస్తుంది. ఎవరినైనా కొడితే ప్రాణాల సహితంగా సమాప్తమైపోతారు. ఇక్కడైతే జన్మ-జన్మాంతరాలు దుఃఖితులుగా అవుతూ ఉంటారు. తండ్రి అంటారు, ఇప్పుడు మీరు కామ ఖడ్గాన్ని నడిపించకూడదు.

ఇప్పుడు మీరు దసరాను జరుపుకుంటున్నారు, తర్వాత దీపావళి వస్తుంది. సత్యయుగంలో దీపావళిని జరుపుకోరు. అక్కడ స్వయం లక్ష్మి రాజ్యం చేస్తారు, అక్కడ వారిని పూజించరు. మనుష్యులు ఎవరైతే మందిరాల్లో ఉంటారో, వారికి దేవతల జీవిత చరిత్ర గురించి తెలియదు. పిల్లలైన మీకు తెలుసు. పిల్లలైన మీరు రూప్-బసంత్. తండ్రి అంటారు, నేను కూడా శరీరాన్ని ధారణ చేసాను. కానీ నేను ధారణ చేసే విధానమే వేరు. ఇప్పుడు మనకు దీపావళి యొక్క సంతోషం కలగదు ఎందుకంటే మనం వనవాసములో ఉన్నాము. మనం పుట్టినింటి నుండి అత్తవారింటికి వెళ్తాము. బాబా సందేశాన్ని పంపించారు, 108 అతుకులు ఉన్న వస్త్రాలను ధరిస్తే దేహాభిమానం తొలగుతుంది. ఈ సమయంలో మీరు ముళ్ళ ప్రపంచం నుండి పుష్పాల ప్రపంచంలోకి వెళ్తున్నారు. బాగా చదువుకుంటే నవాబులుగా అవుతారు అని అంటారు. తండ్రి అంటారు, నేను మిమ్మల్ని నరుని నుండి నారాయణునిగా చేస్తాను. కావున పురుషార్థము ఉన్నతమైనది చేయాలి. నేను చదివిస్తున్నప్పుడు మరి పదవిని ఎందుకు పాడు చేసుకుంటారు? తల్లి తండ్రులను ఎందుకు ఫాలో చేయరు? ఎవరైతే బాగా చదువుతారో వారే రాజ్యంలోకి వస్తారని బాబా సాక్షాత్కారం చేయించారు. మీకు తెలుసు, మనం స్వర్గవాసులుగా అయ్యేందుకు చదువుతున్నాము. మనుష్యులు మరణించినప్పుడు స్వర్గవాసులుగా అవుతారని భావిస్తారు. మీకు తెలుసు, బాబాయే వచ్చి స్వర్గములోకి తీసుకువెళ్తారు మరియు రావణుడు మళ్ళీ నరకవాసిగా చేస్తాడు. మనుష్యులు హిందువులు, చైనీయులు పరస్పరంలో సోదరులు అని అంటారు, మళ్ళీ ఒకరికొకరు దుఃఖాన్ని ఇచ్చుకుంటూ ఉంటారు. తల్లి తండ్రుల నుండి సుఖపు గనులు లభిస్తున్నాయని మీకు తెలుసు. తర్వాత మెల్ల-మెల్లగా కళలు తగ్గుతూ ఉంటాయి. నీవు ఉన్నతిలోకి వెళ్ళే సమయాన నీ కారణంగా సర్వులకు మేలు జరుగుతుంది... అని అంటారు. మరి ఇప్పుడు అందరి మేలు జరుగుతుంది. కొందరు నరకము నుండి బయటపడి స్వర్గవాసులుగా అవుతారు, కొందరు శాంతిధామ నివాసులుగా అవుతారు, మరి మేలు జరిగినట్లే. సత్యయుగములో దుఃఖాన్నిచ్చే వస్తువేదీ ఉండదు. గొప్ప వ్యక్తుల ఫర్నీచర్ కూడా గొప్పగా ఉంటుంది. అక్కడ దుఃఖాన్ని ఇచ్చే జంతువులు మొదలైనవి ఉండవు ఎందుకంటే ఫర్నీచర్ మంచిది ఉండాలి. దానిని హెవెన్ అని అంటారు. అల్లా అవల్దీన్ ఆట ఉంది, దానిని రుద్దడంతో రాజ్యం లభిస్తుంది. కావున అల్లా అయిన తండ్రి అవల్దీన్ అనగా ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తారు. కావున తండ్రి క్షణములో వైకుంఠానికి యజమానులుగా చేస్తారు. బాబా అవల్దీన్ యొక్క సాక్షాత్కారం చేయిస్తారు. అంతేకానీ, సాక్షాత్కారములోకి వెళ్తామని పిల్లలు అనడం కాదు. ధ్యాని కన్నా జ్ఞాని నాకు ప్రియమైనవారు అని బాబా అన్నారు. ధ్యానములో మాయ ప్రవేశిస్తుంది. జ్ఞానములోకి మాయ రాదు. ఎవరైతే నవవిధ భక్తిని చేస్తారో, వారికి తండ్రి సాక్షాత్కారం చేయిస్తారు. ఇక్కడ నవవిధ భక్తి ఏమీ చేయడం జరగదు. చిన్న-చిన్న పిల్లలకు సాక్షాత్కారాలు జరుగుతాయి. ఒకవేళ ధ్యానం అలవాటైపోతే చదువును చదవలేరు అని ఇక్కడ చెప్పడం జరుగుతుంది. ప్రారంభంలో ధ్యానం యొక్క ప్రోగ్రాములను ఎన్ని తీసుకువచ్చేవారు. కానీ వారు ఈరోజు లేరు. జ్ఞానీ ఆత్మలకు ఏ విషయములోనూ సంశయం కలగదు, సంశయం వచ్చి చదువును వదిలారంటే తండ్రిని వదిలేసినట్లే. ఇప్పుడు సూర్యవంశీయులైన దేవీ-దేవతల రాజధాని యొక్క స్థాపన జరుగుతుంది. ఇతర ధర్మస్థాపకులు రాజధానిని ఏమీ స్థాపించరు, ఎప్పుడైతే ధర్మం యొక్క వృద్ధి జరుగుతుందో అప్పుడు రాజ్యం నడుస్తుంది. కావున ఇప్పుడు మీరు విశ్వానికి యజమానులుగా అవుతున్నారు. ఎవరైనా కొత్తవారు వస్తే, పరమపిత పరమాత్మతో మీకు ఏం సంబంధం ఉంది అని అడగండి. వారు తండ్రి అని అంటారు. బాబా స్వర్గ స్థాపన చేస్తారు మరియు రావణుడు నరకాన్ని తయారుచేస్తాడు, ఎవరైతే స్వర్గాన్ని తయారుచేసారో వారిని పూజిస్తారు, ఎవరైతే నరకాన్ని తయారుచేసారో వారిని కాలుస్తారు ఎందుకంటే నరకంలో మనుష్యులు కామ చితిపై కాలిపోతారు, కావున కోపంలోకి వచ్చి రావణుడిని కాలుస్తారు. కానీ రావణుడు కాలడు. కేవలం పరంపరగా కొనసాగుతూ వస్తుందని అంటారు. కానీ పరంపర యొక్క అర్థము తెలియదు. శత్రువు యొక్క దిష్టిబొమ్మను కాలుస్తారు. రావణుడిని ఎందుకు కాలుస్తారు? ఎందుకంటే రావణుడు మిమ్మల్ని కాలుస్తాడు. మీరు రావణుడిని కాలుస్తారు, కానీ మనుష్యులకేమీ తెలియదు. సత్యయుగములోనైతే సంపూర్ణ నిర్వికారిగా ఉంటారు కావున అక్కడ రావణుడిని కాల్చరు. దానిని నిర్వికార ప్రపంచము అని అంటారు, మనం స్వర్గవాసులుగా అయ్యేందుకు తండ్రి నుండి స్వర్గం యొక్క వారసత్వాన్ని తీసుకుంటున్నాము. శాపాన్ని ఇచ్చేవాడు రావణుడు. రావణుడు అని ఎవరినంటారు? స్త్రీ యొక్క 5 వికారాలను,

పురుషుని యొక్క 5 వికారాలను అంటారు. సత్యయుగములో ఈ వికారాలు ఉండేవి కావు. సన్యాసులు తర్వాత వస్తారు. ఇప్పుడైతే దేవతా ధర్మం లేదు. మళ్ళీ అది స్థాపించబడుతుంది. 108 మాల తయారవుతుంది కావున ప్రజలు కూడా కావాలి కదా. జైపూర్ రాజు ఒక్కరే ఉండేవారు, ప్రజలు ఎంతమంది ఉండేవారు. ఇప్పుడు మాల అయితే తయారవుతుంది, ప్రజలు కూడా కావాలి. ఎవరైతే ఇక్కడ పిల్లలుగా అయి మళ్ళీ వెళ్ళిపోతారో, వారు సాధారణ ప్రజల్లోకి వెళ్ళిపోతారు. గృహస్థ వ్యవహారములో ఉంటూ జీవన్ముక్తి కావాలి అని అంటారు. జీవన్ముక్తులుగా అయితే ఒక్కరే అవ్వరు. పూర్తి వంశము కావాలి. క్షణములో జీవన్ముక్తి లభించిందని అష్టావక్ర గీతలో రాసి ఉంది. కానీ ఎలా లభించింది? అది తెలియదు. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం చాలా సుఖాన్ని ఇచ్చేటువంటిది. రాజ్యం లభిస్తున్నప్పుడు మరి మనం శ్రీమతంపై ఎందుకు నడవకూడదు! కమల పుష్ప సమానముగా ఎందుకు అవ్వకూడదు! మీరు బ్రాహ్మణులు కదా. కావున శంఖం, చక్రం, గద, పదమాలు మీ వద్ద ఉన్నాయి.

మనుష్యులు దీపావళి నాడు కేవలం ఒక రోజు కొత్త వస్త్రాలు ధరిస్తారు, మందిరాలకు వెళ్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు కొత్త వస్త్రాలను ధరించరు, దీపావళి నాడు కొత్త వస్త్రాలను ధరిస్తారు, అన్నీ కొత్తవే. ఆ రోజున వ్యాపారస్థులు తమ పాత ఖాతాను సమాప్తం చేసి కొత్త ఖాతాను ప్రారంభిస్తారు. మీరు కూడా ఇప్పుడు పాత ఖాతాను సమాప్తం చేసి కొత్తదానిని ప్రారంభిస్తున్నారు. తండ్రి లాభాన్ని కలిగిస్తారు, రావణుడు నష్టపరుస్తాడు. లాభం ఎలా కలుగుతుంది? మన్మనాభవ, మధ్యాజీ భవ. విష్ణువు మధ్యలో ఉన్నారు కదా. మధ్యాజీ భవ అనగా తండ్రి బ్రహ్మ ద్వారా విష్ణు పురిని స్థాపన చేస్తారు. కావున పాత ప్రపంచం వినాశనమవుతుంది. కావున శివబాబా కలియుగాంతములో వస్తారు తర్వాత సత్యయుగం ఆది వస్తుంది. బ్రహ్మ ద్వారా స్థాపన అని రాసి కూడా ఉంది. బ్రహ్మ అయితే ప్రజాపిత కదా. మరి మీరు ఎవరి పిల్లలు? శివుని సంతానమా లేక బ్రహ్మ సంతానమా? నీవే తల్లివి, తండ్రివి... అని అంటారు కూడా. తప్పకుండా తల్లి తండ్రులు ప్రాక్టికల్ గా ఇప్పుడు ఉన్నారు. చదువు చదువుకొని మళ్ళీ వారసత్వాన్ని పొందుతున్నారు, మళ్ళీ రావణుడు వచ్చి దుఃఖితులుగా చేస్తాడు. దుఃఖము కూడా మెల్ల-మెల్లగా పెరుగుతుంది. ఈ కలియుగము విషయ సాగరము. సత్యయుగము క్షీరసాగరము. విష్ణువును క్షీరసాగరములో చూపిస్తారు. వాస్తవానికి మీకు తెలుసు - వారికి దసరా, దీపావళి గురించి ఏం తెలుసు... మనమైతే రహస్యాన్ని అర్థం చేసుకున్నాము. మీకు తెలుసు, నిన్న మనం స్వర్గములో ఉండేవారము, ఇప్పుడు నరకములో ఉన్నాము. మళ్ళీ రేపు స్వర్గంలో ఉంటాము. రేపు అని ఎందుకు అంటారు? ఎందుకంటే రాత్రి తర్వాత పగలు వస్తుంది. ఎవరైనా వస్తే, ఈ ఆశ్రమం ఎవరిది అని అడగండి. ప్రజాపిత బ్రహ్మ పేరును విన్నారా? ఇంతమంది బ్రహ్మకుమారీ, కుమారులు ఉన్నారంటే బ్రహ్మ తండ్రి అయినట్లు. తండ్రి నుండి వారసత్వమే లభిస్తుంది. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే మధ్యాజీ భవగా అవుతారు. వ్యాపారం చేయవద్దు అని తండ్రి అనరు. బాబా అంటారు, వ్యాపారాలు చేసుకోండి కానీ బాబాను స్మృతి చేయండి ఎందుకంటే వారి నుండి వారసత్వం లభిస్తుంది. ఈ ఆశ ఉంది కదా, ఇతర స్థానాలలో ఇటువంటి ఆశ ఉండదు. స్కూలులో కూడా ఆశ ఉంటుంది, అందుకే విద్యార్థి జీవితం ఉత్తమ జీవితం అని అంటారు. ఇది అనంతమైన చదువు. అనంతమైన చరిత్ర-భౌగోళికాల గురించి మీకు తెలుసు. అనంతమైన చరిత్ర-భౌగోళికాలు ఏమిటో స్కూళ్ళకు వెళ్ళి చెప్పండి. వారికి చెప్పాలి, మీరైతే హద్దు చరిత్ర-భౌగోళికాలను చదువుతారు, మేము మీకు లక్ష్మీ-నారాయణుల అనంతమైన చరిత్ర-భౌగోళికాలను తెలియజేస్తాము, లక్ష్మీ-నారాయణులు ఆ పదవిని ఎలా పొందారో తెలియజేస్తాము. ముున్ముందు మీకు కాలేజీలలో కూడా ఆహ్వానాలు లభిస్తాయి. ఇది ఈశ్వరీయ విశ్వ విద్యాలయము. వారు ఆత్మిక తండ్రి. కావున ఆత్మలకు ఆత్మిక జ్ఞానాన్ని ఇస్తారు. నిరాకారుడు సాకారునిలోకి వచ్చి వినిపిస్తారు. ఇందులో శ్రీకృష్ణుని విషయమేమీ లేదు. ఏ విషయాన్ని అర్థం చేసుకోరు. దారము చిక్కుపడి ఉంది. స్వతంత్రులుగా అవ్వాలనుకుంటారు కానీ గొడవలు పెరుగుతూనే ఉంటాయి. స్వతంత్రము కావాలి అని అంటారు. రావణుడి నుండి సత్యాతి-సత్యమైన స్వతంత్రము మీకు లభిస్తుంది. మేము క్రిస్టియన్ల నుండి స్వతంత్రాన్ని పొందామని భారతవాసులు భావిస్తారు, కానీ స్వతంత్రం ఎక్కడ ఉంది? స్వతంత్రము మీకు లభిస్తుంది, స్వతంత్ర రాజ్యము. నీవు లభించడంతో భూమి, ఆకాశము, సాగరము అన్నీ మావిగా అవుతాయని పాటను విన్నారు కదా. అందులో హద్దులు ఉండవు. అచ్ఛా!

మధురాతి-మధురమైన 5000 సంవత్సరాల తర్వాత మళ్ళీ కలిసిన, వారసత్వాన్ని పొందే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తల్లి-తండ్రులను పూర్తిగా ఫాలో చేసి చదువులో ఉన్నత పదవిని పొందాలి. ఈ ప్రపంచంలో ఏ అభిరుచిని

పెట్టుకోకూడదు. వనవాసములో ఉండాలి.

2. ఈ కళ్ళకు ఏవైతే కనిపిస్తాయో వాటిని చూస్తూ కూడా చూడకూడదు. పూర్తి నష్టోమోహులుగా అవ్వాలి. సంగమములో ఏదీ వ్యర్థం చేయకూడదు.

వరదానము:- తమ కర్తవ్యం యొక్క స్మృతి ద్వారా సేవ యొక్క ఫలాన్ని మరియు బలాన్ని ప్రాప్తి చేసుకునే విశ్వ కళ్యాణకారి భవ

ఏ పని చేస్తున్నా తమ కర్తవ్యాన్ని ఎప్పుడూ మర్చిపోకండి. ఎలాగైతే పాండవులు గుప్త వేషంలో పని చేసారు కానీ విజయం యొక్క నషా ఉండేది. అలాగే మీరు గవర్నమెంటు సర్వెంట్ అయి ఉండవచ్చు, ఉద్యోగం చేస్తూ ఉండవచ్చు కానీ నేను విశ్వ కళ్యాణకారిని అనే నషా ఉండాలి. కనుక ఈ స్మృతి ద్వారా స్వతహాగా సమర్థులుగా ఉంటారు మరియు సదా సేవా భావము ఉన్న కారణంగా సేవ యొక్క ఫలము మరియు బలము లభిస్తూ ఉంటుంది. భావనకు ఫలము లభిస్తుందని అంటూ ఉంటారు కనుక మీ సేవా భావన అనేక ఆత్మలకు శాంతి, శక్తి యొక్క ఫలాన్ని ఇస్తుంది.

స్లోగన్:- ఈశ్వరీయ విద్యార్థి స్వరూపము సదా స్మృతిలో ఉన్నట్లయితే మాయ రాలేదు.